క్లుప్తంగా

ముసలమ్మ జాతర షురూ..

గుండాల: ఈసం వంశీయుల ఇలవేల్పు దూలుగొండ ముసలమ్మ దేవత జాతర బుధవారం రోళ్లగడ్డలో ఘనంగా ప్రారంభించారు. ఈసం, మాడె వంశీయులు, పూజారులు, వడ్డెలు ప్రత్యేక పూజలతో మండ మెలుగుట, గుడి మెలుగుట కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం దేవతను గద్దెలపై ప్రతిష్ఠించడం జరుగుతుంది. దీంతో నిండు జాతర మొదలవుతుంది. శుక్రవారం మొక్కులు చెల్లించు కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గిరిజన సాంప్రదాయాలతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. విద్యుత్ దీపాలతో గుడిని అలంకరించారు. ఈ మూడు రోజుల పాటు జరిగే జాతరకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

దాడి కేసు నమోదు

చంద్రుగొండ: మండల పరిధిలోని తిప్పనపల్లి గ్రామంలో ఓ వ్యక్తిపై దాడి చేసిన ఏడుగురిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై విజయలక్ష్మి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. తిప్పనపల్లి గ్రామానికి చెందిన భోగి గాంధీ కుటుంబ సభ్యులతో పాటు ఇంటి పక్కనే ఉండే శేఖర్‌ను తీసుకుని బుధవారం దుమ్ముగూడెం మండలంలోని బండ్లరేవు గ్రామంలో జరుగుతున్న తమ మేనల్లుడి వివాహానికి వెళ్లాడు. ఆ వేడుకల్లో శేఖర్, గాంధీ బంధువులతో గొడవ పడ్డాడు. గాంధీ గొడవ జరుగుతుండగా సర్దిజెప్పి శేఖర్‌ను ఓ దెబ్బ కొట్టాడు. ఈ విషయాన్ని శేఖర్ తన కుటుంబ సభ్యులకు తెలిపాడు. ఆపై వివాహ వేడుకల నుంచి తిప్పనపల్లికి గాంధీ కుటుంబ సభ్యులు సైతం తిరిగి వచ్చారు. ఇదే సమయంలో శేఖర్ మరో ఆరుగురుతో కలిసి వారిపై దాడి చేసి గాయపరిచాడు. దాడిలో విజయలక్ష్మి చేతికి, పుష్పాకు, గాంధీకి, పదేళ్ల బాలుడైన యోగేశ్వర్‌కు గాయాలైనట్లు ఎస్సై తెలిపారు. పుష్పా ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి పంపినట్లు వెల్లడించారు.

జయప్రదం చేయాలి

అశ్వారావుపేటరూరల్: ఆదివాసీ టీచర్స్ అసోషియేషన్ (ఏటీఏ) జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కొర్సా రాజేశ్, పద్దం రాము కోరారు. మండల పరిధిలోని పండువారిగూడెం గ్రామంలోగల ప్రభుత్వ పాఠశాలలో బుధవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఈ నెల 11వ తేదీన మణుగురులో జరిగే ఏటీఏ జిల్లా మహాసభలకు బాధ్యులైన వారంతా హాజరై విజయవంతం చేయాలని అన్నారు. నాయకులు ఈ సీతారాములు, పి.రాము, ఈ.రాజేశ్, టి.శ్రీను, పి.వెంకట్, కె.రాజేశ్, ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

12న ఐఎఫ్‌టీయూ మహాసభ

గుండాల: ఈ నెల 12న న పాల్వంచ పట్టణంలో జరుగు భారత కార్మిక సంఘాల సమైక్య ఐఎఫ్‌టీయూ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకులు యాసారపు వెంకన్న పిలుపునిచ్చారు. బుధవారం మహాసభ విజయవంతం కోరుతూ పోస్టర్ ఆవిష్కరించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న భారత కార్మికుల సంఘాల సమైక్య భవిష్యత్ ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు ఈ మహాసభ అన్నారు. అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

తుమ్మల పరామర్శ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారం వారిగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బండి పుల్లారావు కుటుంబాన్ని బుధవారం రాష్ట్ర మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్న ముళ్లపూడి శరబయ్య ఆస్పత్రిలో చికిత్స పొందే క్రమంలోనే మంగళవారం రాత్రి చెందారు. ఈ సమాచారం అందుకున్న మాజీ మంత్రి తుమ్మల మృతుని చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబీకులను పరామర్శించారు. నాయకులు నార్లపాటి రాములు, జుజ్జురపు సుబ్బారావు, బొడ్డపాటి ప్రసాద్ ఉన్నారు.

అనారోగ్య బాధితుడికి..

అశ్వాపురం: మండల పరిధిలోని బట్టీలగుంపు గ్రామ పంచాయతీలోని పాములపల్లి గ్రామానికి చెందిన కన్నయ్య అనారోగ్యంతో బాధపడుతుండటంతో బుధవారం ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు కన్నయ్య నివాసంలో బుధవారం పరామర్శించారు. ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు కొర్సా దుర్గారావు, నాయకులు పాల్గొన్నారు.

హోలీ వేడుకలు

అశ్వాపురం: మినీ ఇండియాగా పిలువబడుతున్న మండల కేంద్రంలోని భారజల కర్మాగారం అధికారులు, ఉద్యోగుల నివాస సముదాయమైన గౌతమీనగర్ కాలనీలో బుధవారం హోలీ వేడుకలు ఉత్సాహంగా జరుపుకున్నారు. కాలనీలో భారజల వేదిక ప్రాంగణంలోవివిధ రాష్ట్రాలకు చెందిన ఉద్యోగులు, కాలనీ వాసులు ఒకే చోట చేరి ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు. ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశవరావు, అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మహిళా మణులకు పట్టం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కాలేజీలు, వైద్యశాలలు, పంచాయతీల్లో వేడుకలు నిర్వహించారు. మహిళలందరూ ఒక చోట చేరి ఆటల పోటీల్లో పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మహిళ ప్రజాప్రతినిధులు, అధికారులతోపాటు పలువురు మహిళలను సన్మానించారు. వక్తలు మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ దూసుకుపోతున్నారని, తల్లిగా, చెల్లిగా, భార్యగా, ఉద్యోగినిగా తమ బాధ్యతలు నిర్వహిస్తూ ఎవరికీ అందనంత ఎత్తుకి ఎదిగిపోయారని కొనియాడారు. సమాజాభివృద్ధిలో మహిళ పాత్ర, కృషిని వివరించారు. – సాక్షి నెట్‌వర్క్


మణుగూరురూరల్: మహిళా కార్యకర్తలతో విప్ రేగా కాంతారావు


అశ్వారావుపేటరూరల్: ఎంపీడీఓ కార్యాలయంలో మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు..


దుమ్ముగూడెం: అసిస్టెంట్ కమాండెంట్ రేవతిని సన్మానిస్తున్న రూపారాణి


అన్నపురెడ్డిపల్లి: డాక్టర్లు ప్రియాంక, తన్మయిలను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు


మణుగూరుటౌన్: సింగరేణి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిని సన్మానిస్తున్న జీఎం


అశ్వాపురం: మహిళా దినోత్సవ వేడుకల్లో జబర్దస్త్ కళాకారులు


భద్రాచలం: జెడ్పీ పాఠశాలలోని కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ సలోమి


అశ్వారావుపేట: తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు


గుండాల: సమావేశంలో మాట్లాడుతున్న టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బాలు


దమ్మపేట: జాతీయ మహిళా సమాఖ్య జెండా ఆవిష్కరిస్తున్న మహిళలు


అశ్వారావుపేటరూరల్: జెడ్పీటీసీ సభ్యురాలిని సన్మానిస్తున్న దృశ్యం


చంద్రుగొండ: డీసీసీబీ బ్యాంకులో మహిళా దినోత్సవం


ములకలపల్లి: జెడ్పీటీసీ, ఎంపీటీసీలను సత్కరిస్తున్న దృశ్యం

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

అశ్వాపురం: నియోజకవర్గంలోని ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధే తన ధ్యేయమని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. మండల పరిధిలోని అమ్మగారిపల్లి గ్రామ పంచాయతీలోని కుమ్మరిగూడెం గ్రామం నుంచి పాములపల్లి వరకు సుమారు రూ.47 లక్షలతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు నిర్మాణానికి బుధవారం ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు శంకుస్థాపన చేశారు. మిట్టగూడెం గ్రామంలో రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గజ్జల లక్ష్మారెడ్డి నివాసంలో తేనిటి విందు కార్యక్రమంలో ఎమ్మెల్యే రేగా కాంతారావు పాల్గొన్నారు. సందర్భంగా ఎమ్మెల్యే రేగా మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందు ముందు మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. సీసీరోడ్లు, బీటీ రోడ్లు, అంతర్గత రహదారులు నిర్మిస్తున్నామని, అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వామ్యం కావాలని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సూదిరెడ్డి సులక్షణ, వైస్ ఎంపీపీ వీరభద్రం, సర్పంచ్ పాయం భద్రయ్య, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎన్నా అశోక్‌కుమార్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు కొర్సా దుర్గారావు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే క్షయ నియంత్రణ


టీబీ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న ఏఎస్పీ పరితోష్ పంకజ్

భద్రాచలంటౌన్: సరైన పౌష్టికాహారం తీసుకోవడం వల్లనే క్షయ వ్యాధి నియంత్రన సాధ్యమని భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. భద్రాచలం పట్టణంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఐఎంఏ, అదనపు జిల్లా టీబీ నియంత్రన అధికారి ఆధ్వర్యంలో టీబీ వ్యాధిగ్రస్తులకు బుధవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన ఆయన వ్యాధి బాధితులకు పౌష్టికాహారం పంపిణీ చేసి మాట్లాడారు. టీబీ బాధితులు క్రమం తప్పకుండా మందులు వేసుకోవడంతో వ్యాధి పూర్తిగా తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కాంతారావు, సుదర్శన్‌రావు, శ్రీనివాసరావు, సోమయ్య, దేశప్ప, రాజారెడ్డి, వెంకటాచారి, రవి తదితరులు పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా సేవా సభ్యులు చేస్తున్న సామాజిక సేవలు అభినందనీయమని ఏరియా సేవా అధ్యక్షురాలు దుర్గం సుమతి రామచందర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏరియా సేవా సభ్యులు, వృత్తివిద్య శిక్షణ పొందుతున్న మహిళల ఆధ్వర్యంలో బాలవెలుగు ప్రత్యేక పాఠశాల విద్యార్థుల గురుకుల ప్రవేశ పరీక్షల ఫీజుకు రూ.7వేల ఆర్థిక సహాయాన్ని బుధవారం పాఠశాల నిర్వాహకులు బి.జగన్మోహన్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సేవా అధ్యక్షురాలు మాట్లాడుతూ.. మహిళల ఆర్థిక స్వాలంబనకు సింగరేణి సంస్థ అందిస్తున్న ప్రోత్సాహాన్ని, వృత్తి విద్యా శిక్షణ కేంద్రాలను ఆసక్తి గల మహిళలు, యువతులు సద్వినియోగపర్చుకోవాలని కోరారు. దాతల సహకారంతో బాలవెలుగు విద్యార్థులు కూడా ఉన్నత విద్యను అభ్యసించి.. భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం ఏరియా సేవా కార్యదర్శి షేక్ షాకీరా బేగం, మాధురిలు 50కిలోల బియ్యాన్ని పాఠశాలకు వితరణగా అందించారు. అనంతరం సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్న షాకీరాను శాలువాతో, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు క్లబ్ కార్యదర్శి డి.అనిత, బి.కవిత, ఏరియా డీజీఎం (పర్సనల్) రమేష్, టిబిజికెఎస్ డిప్యూటి జనరల్ సెక్రటరి అబ్దుల్ రవూఫ్, అధికారులు సింగు శ్రీనివాస్, అవినాష్, జాన్ వెస్లీ, సేవా సభ్యులు జమీలా బేగం, సంధ్యారాణి, సత్యవతి, స్రవంతి, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏరియా సేవా అధ్యక్షురాలు సుమతి

చర్లలో విద్యుత్ శాఖ గ్రీవెన్స్‌డే

చర్ల: మండల కేందరమైన చర్లలో రెండు రోజుల పాటు విద్యుత్ సంబంద సమస్యలను తెలుసుకునేందుకు గ్రీవెన్స్‌డేను నిర్వహిస్తున్నట్లు చర్ల ట్రాన్స్‌కో ఏఈ యోహాను తెలిపారు. 9, 10 తేదీలలో చర్లలోని విద్యుత్ శాఖ సబ్ డివిజన్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు భద్రాచలం ఎలక్ట్రికల్ డీఈ, ఏఏఓ అందుబాటులో ఉంటారని విద్యుత్ సంబంధ సమస్యలను విన్నవించుకునేందుకు వినియోగదారులు తరలిరావాలని ఆయన కోరారు.

15న వేలం పాట

భద్రాచలంటౌన్: భద్రాచలం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఈ నెల 15న బహిరంగ వేలం పాటలను నిర్వహించనున్నట్లు పంచాయతీ ఈఓ వెంకటేశ్వర్లు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పంచాయతీ పరిధిలోని ఆశీలు, గోదావరి ఫెర్రీ, కొత్త మార్కెట్ సంత, యూబీ రోడ్ హెడీఎఫ్‌సీ బ్యాంక్ ఎదురుగా పార్కింగ్, పాత మార్కెట్ నందు ఆనంద నిలయం పార్కింగ్‌లకు వేలంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ ఆవరణాలో 2023–24 సంవత్సరానికి గాను నిర్వహించే ఈ వేలంలో పాల్గొనే వారు ఉదయం 10.30 గంటలకు హాజరు కావాలని తెలిపారు. పూర్తి వివరాలకు పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

రామయ్యను దర్శించుకున్న పాడేరు పీఓ

భద్రాచలం: భద్రాచలం సీతారామచంద్రస్వామి వారిని పాడేరు ఐటీడీఏ పీఓ గోపాలకృష్ణ బుధవారం దర్శించుకున్నారు. ముందుగా ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అంతరాలయంలో మూలమూర్తులను, ఉపలాయాలలో ప్రత్యేక పూజలను నిర్వహించి స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

రోటరీ క్లబ్ వితరణ

భద్రాచలంటౌన్: ప్రపంచ మహిళా దినోత్సవ సందర్భంగా రోటరీ క్లబ్ భద్రాచలం ఆధ్వర్యంలో బుధవారం ఏరియా ఆసుపత్రిలోని బాలింతలకు, గర్భిణులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ, రమేష్, నాగేశ్వరరావు, విద్యాసాగర్, ఆజీమ్, చలపతి, రఫీ, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

‘ఆరోగ్య మహిళ’ ప్రారంభం

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల వైద్యశాలలో ఆరోగ్య మహిళ సేవలను ఎంపీపీ రేసు లక్ష్మి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రేణుకారెడ్డి మహిళలకు వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పర్ణశాల వైద్యశాలలో ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళ సేవలు అందించనున్నట్లు తెలిపారు. మహిళలకు 8 రకాల వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి వాటికి ఉచితంగా మందులను ఇవ్వడం జరుగుతుందని, దీని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, సర్పంచ్ కారం జయ, వైద్య సిబ్బంది రామలక్ష్మి, అనసూర్య, నాగేశ్వరావు, సుజాత, కృపారాణి, నాగరాజు, పార్వతి, నరసమ్మ, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: ప్రభుత్వం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని మండల పరిధిలోని ఎర్రగుంట పీహెచ్‌సీలో బుధవారం స్థానిక ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ మహిళలకు ఎదురైయ్యే అనారోగ్య సమస్యలను ముందుగా గుర్తించి చికిత్స అందించడం జరుగుతుందన్నారు. ఆరోగ్య మహిళా కార్యక్రమం ద్వారా బావితరానికి ఆరోగ్యవంతమైన మహిళలను అందించడమే ధ్యేయమన్నారు. కార్యక్రమంలో భాగంగా మహిళలకు కేన్సర్, బీపీ, షుగర్, రక్తహీనత సమస్యలను ప్రాథమిక దశలలో గుర్తించడం జరుగుతుందని, మహిళలందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా ప్రజాప్రతినిధులు వైద్యులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ తన్మయిలను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గుంపెన పీఏసీఎస్ చైర్మన్ బోయినపల్లి సుధాకర్, వైస్‌ఎంపీపీ మామిళ్లపల్లి రామారావు, సర్పంచ్ నున్న బసవయ్య, హెచ్ఎస్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: మహిళలందరూ తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత కోరారు. మోరంపల్లిబంజర పీహెచ్‌సీలో బుధవారం ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం మహిళల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి అన్నిరకాల వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా మహిళలందరూ కేన్సర్ స్క్రీనింగ్ చేయించుకోవాలన్నారు. ప్రతి మంగళవారం మోరంపల్లిబంజర పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళా కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ స్పందన, డాక్టర్ లక్ష్మీసాహితి, డాక్టర్ మౌనిక, సీహెచ్‌ఓ సోమ్లానాయక్, హెచ్ఈఓ రవి, రమణమూర్తి, సదాలదేవి, భవాని, ఏఎన్ఎమ్‌లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ శ్రీలత


అన్నపురెడ్డిపల్లి: కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

కేసీఆర్ కిట్టు పంపిణీ

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల ప్రాథమికారోగ్యకేంద్రంలో బాలింతరాలికి జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ చేతుల మీదుగా కేసీఆర్ కిట్‌ను బుధవారం అందజేశారు. వైద్యశాలలో జరిగిన అంతర్జాతీయ మహిళ దినోత్సవంలో పాల్గొన్న అనంతరం బాలింతకు కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా తెల్లం సీతమ్మ మాట్లాడుతూ.. ప్రజలు ప్రభుత్వ వైద్యశాలలో పరీక్షలు చేయించుకోవాలని, అక్కడ మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కారం జయ, డాక్టర్ రేణుకారెడ్డి, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కిట్టు అందజేస్తున్న జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, వైద్యురాలు రేణుకారెడ్డి

అటెన్షన్ ప్లీజ్

పేరుకుపోయిన చెత్త


మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్యనగర్‌లో చెత్తాచెదారం పేరుకుపోయింది. చెత్త సేకరణ సక్రమంగా లేకపోవడం వల్లే వీధుల్లో చెత్తాచెదారం కుప్పలుగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు. మున్సిపల్ అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించాలని కోరుతున్నారు. – మణుగూరుటౌన్

ప్రశ్నించాల్సిన అధికారి: మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్, మణుగూరు
ఫోన్ నంబర్: 9849909514

మహిళలకు వడ్డీలేని రుణాలు


చంద్రుగొండ: మంజూరైన రుణపత్రాలతో మహిళలు

బూర్గంపాడు: మహిళల ఆర్థికాభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలను అందిస్తోందని జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత అన్నారు. బూర్గంపాడు మార్కెట్‌యార్డులో ఐకేపీ మండల మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం రూ 1.56 కోట్ల వడ్డీలేని రుణాలను మహిళా సంఘాలకు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డ్వాక్రా సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న వడ్డీ లేని రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా స్థిరపడాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను మహిళలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులకు ఆటపోటీలు నిర్వహించారు. ఆటల పోటీలలో గెలిచిన మహిళలకు తాళ్లూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బహుమతులను అందించారు. స్వయం సహాయక సంఘాలకు ఉత్తమ సేవలను అందించిన వీఏఓలకు ఎస్‌బీఐ బ్యాంకు ఆధ్వర్యంలో మెమెంటోలు అందించారు. ఆయా కార్యక్రమాలలో ఏపీఎం మడిపల్లి నాగార్జున, వల్లూరిపల్లి వంశీకృష్ణ, జె.శ్రీనివాస్, తంబికుమార్, జీవన్, రాంబాబె, అరుణ, నిర్మల, లీలావతి, ఉపేందర్, ప్రేమ్‌కుమార్, స్రవంతి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ: మండలంలోని పొదుపు సంఘాల మహిళలకు మంజూరైన రుణపత్రాలను బుధవారం పంపిణీ చేశారు. మొత్తం 1000 గ్రూపులకు గాను రెండు విడతలుగా మంజూరైన సుమారు రూ.80 లక్షల రుణాలకు సంబంధిన పత్రాలను మహిళా సంఘాలకు ఏపీఎం సంతోష్‌కుమార్ అందించారు.